క్లుప్తంగా

ఎంఐజీ లేఔట్ పరిశీలన


ఎంఐజీ లేఔట్‌ను పరిశీలిస్తున్న జేసీ లావణ్యవేణి

ఏలూరు(మెట్రో): ఏలూరు శనివారపుపేటలో ఉన్న ఎంఐజీ లేఔట్‌కు ల్యాండ్ ఎక్విటేషన్ కోసం జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి స్థల పరిశీలన చేశారు. శుక్రవారం తహసీల్దార్ సోమశేఖర్‌తో కలిసి ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి సంబంధించిన ఎంఐజీ లేఅవుట్‌కు 17 సెంట్లు ల్యాండ్ ఎక్విజేషన్ కోసం జేసీ క్షేత్రస్థాయిలో స్థల పరిశీలన చేసి అధికారులకు తగు సూచనలిచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, సర్వేరు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన రవికుమార్


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న రవికుమార్

ఏలూరు (టూటౌన్): జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌ను జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గుర్రాల నవీన్ కుమార్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులపై సమగ్రంగా చర్చించేందుకు త్వరలోనే ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ మైనారిటీస్ కార్పొరేషన్ డైరెక్టర్ పండు జగదీష్ ప్రతాప్ బాబు పాల్గొన్నారు.

రైలు పట్టాల పక్కన మృతదేహం

ఏలూరు: సీతంపేట రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వే పట్టాలు పక్కన యువకుడి మృతదేహం ఉంది. మృతుడు 20–25 సంవత్సరాల వయస్సు, చామనఛాయ, నల్ల జుట్టు, సిమెంటు రంగు చొక్కా, నీలం రంగు జీన్ ప్యాంట్ ధరించి ఉన్నాడని ఏలూరు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ నంబూరి ఆదినారాయణ తెలిపారు. కేసు దర్యాప్తు చేపట్టామని, వివరాలు తెలిస్తే ఫోన్ నెంబర్ 80740 55378కు తెలియజేయాలని కోరారు.

వరల్డ్ హార్ట్ డే

ఏలూరు : ప్రతి ఒక్కరూ గుండెకు సంబంధించి అవగాహన పెంపొందించుకోవాలని దెందులూరు నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు శుక్రవారం అన్నారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ సెప్టెంబర్ 29న హార్ట్ డే నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయించిందన్నారు. గుండె జాగ్రత్తలు అందరూ తీసుకోవాలని వివరించారు.

పేదల సమగ్రాభివృద్ధే సీఎం జగన్ లక్ష్యం


ఎమ్మెల్యే నానికి వినతిపత్రం అందిస్తున్న గౌడ సంఘం ప్రతినిధులు


ఎమ్మెల్యే నానికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కార్పొరేటర్ స్రవంతి


ఎమ్మెల్యే నానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్న నాయీబ్రాహ్మణులు

ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్: సమాజంలో బలహీనవర్గాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు నియోజకవర్గానికి చెందిన గౌడ సంఘం ప్రతినిధులు శుక్రవారం ఎమ్మెల్యే ఆళ్ల నానిని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ గౌడ సంఘీయులకు కమ్యూనిటీ హాలు భవన నిర్మాణానికి 500 గజాల స్థలం, రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. గౌడ సంఘీయులకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటుతోపాటు గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని వివరించారు. ఏలూరు నియోజకవర్గంలో 31 వేల మందికి ఇళ్లు మంజూరు చేశామని, ఎక్కడా కుల, మతాలు, రాజకీయాలకు తావులేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలను బ్యాక్‌బోన్ వర్గంగా భావిస్తూ బీసీలకు పెద్దపీట వేస్తున్నారని గుర్తు చేశారు. గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా లక్ష్మి, మార్గాని శ్రీకాంత్, చిట్టిబొమ్మ శ్రీనివాస్ గౌడ్, బత్తిన మస్తాన్‌రావు తదితరులు ఉన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్

ఏలూరు టౌన్: అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదల పక్షపాతిగా నిలుస్తోన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని కార్పొరేటర్ తుమరాడ స్రవంతి అన్నారు. వైఎస్సార్ సీపీ ఏలూరు క్లస్టర్–3 మహిళా అధ్యక్షురాలిగా నియమించిన ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆళ్ల నానిని శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తన నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పార్టీ ఆదేశాల మేరకు పని చేస్తానని అన్నారు. సీఎం జగన్ మహిళా సాధికారతకు చేస్తోన్న కృషికి మహిళలంతా ఆయన వెంటే ఉన్నారని చెప్పారు. ఈ సందర్భంగా నాని ఆమెను అభినందిస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. నానిని కలిసిన వారిలో మేయర్ షేక్ నూర్జహాన్, వైఎస్సార్ సీపీ జిల్లా కోశాధికారి, ఏలూరు క్లస్టర్–3 అధ్యక్షుడు మంచెం మైబాబు, యువజన నాయకులు ఈదుపల్లి పవన్ ఉన్నారు.

బీసీలకు అండగా వైఎస్ జగన్

ఏలూరు (టూటౌన్): బీసీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరు నగర నాయీబ్రాహ్మణ సంఘానికి కమ్యూనిటీ హాలు నిమిత్తం రూ.10 లక్షలు మంజూరు చేసినందుకు సంఘం నాయకులు శుక్రవారం నానిని తన క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నానిని దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ అన్ని రంగాల్లోనూ బీసీలకు పెద్దపీట వేస్తున్నట్టు చెప్పారు. సాంప్రదాయ చేతి వృత్తిదారులైన నాయీ బ్రాహ్మణులకు అధిక ప్రాధాన్యత కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. టీటీడీ బోర్డులో సభ్యత్వం, జగనన్న చేదోడు పథకంలో షాపు ఉన్న ప్రతి ఒక్కరికీ ఏటా రూ.10 వేలు సాయం, దేవస్థానం ట్రస్టుబోర్డుల్లో స్థానం కల్పించే జీఓ విడుదల వంటి అనేక కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. సీఎం జగన్ స్ఫూర్తితో నియోజవకర్గంలో బీసీలకు ఏ అవసరం వచ్చినా, సమస్య ఎదురైనా పరిష్కరిస్తానని నాని హామీ నిచ్చారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం నగర అధ్యక్షుడు పరిటాల వీరాస్వామి, జిల్లా కార్యదర్శి కింజంగి రాజు, పార్టీ బీసీ సెల్ ఏలూరు నగర అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి, నాయకులు పొన్నాడ మురళి, గడియాల జైబాబు, వి.కిషోర్, బాయి వెంకట్రావు, రమేష్ పాల్గొన్నారు.

5న అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అక్టోబర్ 5న అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని డెమోక్రటిక్ పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహిస్తామని ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సంఘ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో ఎంపిక చేసిన 100 మంది ఉపాధ్యాయులను సత్కరించనున్నట్టు తెలిపారు. సమావేశంలో డీపీఆర్టీయూ నాయకులు కె.గంగాధరరావు, ఆర్ నాగేంద్రసింగ్, ఎం అచ్యుతరావు, ఎస్ ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

స్వామినాథన్ మృతి తీరనిలోటు

ఏలూరు (టూటౌన్): అంతర్జాతీయ ప్రఖ్యాతి గాంచిన వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ మృతి వ్యవసాయ రంగానికి తీరనిలోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు డేగా ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ఆహార భద్రతను సాధించడానికి విశేషంగా కృషి చేసిన గొప్ప దార్శనికుడు అని కొనియాడారు.

అత్యుత్తమ సేవలు అందించాలి


వైద్య విద్యార్థులతో ప్రమాణం చేయించిన విభాగాధిపతి ప్రొఫెసర్ శ్యామల

ఏలూరు టౌన్: వైద్య విద్యార్థులు తమ విద్యను పూర్తిచేసి ప్రజలకు అత్యుత్తమ వైద్యసేవలు అందించాలని, క్రమశిక్షణ, ఏకాగ్రతతతో విద్యను అభ్యసిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల అనాటమీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ శ్యామల అన్నారు. ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం కాడవెరిక్ ఓత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్య విద్యార్థులు తొలిసారిగా ఒక మృతశరీరాన్ని తాకేముందు చేసే ప్రతిజ్ఞను కాడవెరిక్ ఓత్ అంటారు. మృతదేహాన్ని తాకేముందు వారి ఆత్మకు నివాళులు అర్పించటం, సరైన రీతిలో మనస్సును లగ్నం చేసి విద్యను నేర్చుకుంటామని వారితో ప్రతిజ్ఞ చేయించారు. శరీర అవయవాల గురించి ప్రత్యక్షంగా బోధించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్యామల తన విభాగానికి సంబంధించిన అనేక అంశాలను విద్యార్థులకు వివరించారు. ఈ శిక్షణ ప్రక్రియలో సహాయ అధ్యాపకులు రమ్యశ్రీ, భరత్, మౌల్య ఉన్నారు. వైద్య విద్యార్థులు ప్ల కార్డులు, పోస్టర్ల ప్రదర్శనతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

పెదవేగి : మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం విజయరాయికి చెందిన జెట్టి కోటేశ్వరరావు భార్య భూలక్ష్మి ఈనెల 27న 10 గంటల నుంచి ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో ఆయన ఇంటికి వచ్చాడు. భూలక్ష్మి ఇంట్లో లేకపోవడతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద తెలికినా ప్రయోజనం లేకపోవడంతో కోటేశ్వరరావు పెదవేగి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ముగిసిన శ్రీవారి పవిత్రోత్సవాలు


మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న వేద పండితులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీవారి 22వ వార్షిక పవిత్రోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఉదయం శ్రీమత్ విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం అనంతరం శ్రీవారి మూలమూర్తికి అష్టోత్తర శత (108) కలశాలతో అభిషేకం, మహాపూర్ణాహుతి నిర్వహించి పవిత్ర అవరోపణ, ప్రధాన కుంభోద్వాసన, ప్రదక్షిణ పూర్వక కుంభ బింబ సహిత గర్భాలయ ప్రవేశం చేశారు. కుంభ ప్రోక్షణ, వేద స్వస్తి, మహదాశీర్వచనం, పవిత్ర వితరణ నిర్వహించి నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద గోష్టి నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం స్వామి వారికి చిన్న గరుడ వాహనోత్సవం, సహస్రదీపాలంకరణ సమిత ఊంజల్ సేవ నిర్వహించారు. దేవస్థానం ప్రధానార్చకుడు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు పర్యవేక్షణలో పాంచరాత్రాగమ పండితులు కిళాంబి పవన్ కృష్ణమాచార్యులు, యాజ్ఞిక బృందం విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ట్రస్టీలు పాల్గొనగా కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

దేశ సమగ్రతను కాపాడాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈఓ శ్యామ్‌సుందర్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థులందరూ క్రమశిక్షణతో ఉత్తమ పౌరులుగా తయారై దేశ సమగ్రతను కాపాడాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్ సుందర్ సూచించారు. శుక్రవారం స్థానిక కస్తూరిబా నగరపాలక బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన నా మట్టి – నాదేశం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన నాయకులను, అభివృద్ధికి దోహదపడే మట్టి విశిష్టతను ఎన్నటికీ మరువరాదన్నారు. తొలుత జాతీయ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విద్యార్థినులు జాతీయ నాయకుల వేషధారణలో ఆకట్టుకున్నారు. మరి కొందరు శాస్త్రీయ నృత్యాలు ప్రదర్శించి అబ్బురపరిచారు. మట్టితో ఉన్న అమృత కలశాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.సునీత జిల్లా విద్యాశాఖాధికారికి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్‌కు సోలార్ పవర్


సమావేశంలో పాల్గొన్న ఏఎంసీ సభ్యులు

ఏలూరు రూరల్ : ఏలూరు మార్కెట్‌యార్డ్‌కు త్వరలో సోలార్ పవర్ ఏర్పాటు చేయనున్నట్టు ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు అన్నారు. శుక్రవారం ఏర్పాటుచేసిన మార్కెట్‌యార్డ్ కమిటీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదేశాల మేరకు యార్డ్‌లో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థ నెడ్క్యాప్ సహకారం రూ.38 లక్షలతో సోలార్ పవర్ సిస్టం ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. రూ.70 లక్షలతో రూపొందించిన పత్తేబాద్ రైతుబజార్ షెడ్లు, కాంపౌండ్‌వాల్ తదితర అభివృద్ధి పనులపై ప్రభుత్వానికి నివేదిక పంపించామన్నారు. ఈ పనులు సైతం త్వరలో ప్రారంభమౌతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. వైస్‌చైర్మన్ కంచన రామకృష్ణ మాట్లాడుతూ నెలలు తరబడి విధులకు హాజరుకాని తాత్కాలిక సిబ్బందిని తొలిగించి, కొత్తవారికి అవకాశం కల్పించాలన్నారు. తీర్మానాల అజెండా ముందుగా మార్కెట్ యార్డ్ గౌరవ అధ్యక్షుడు ఆళ్ల నానికి అందజేయాలని అన్నారు. అనంతరం కార్యదర్శి కేఎస్ రాణి ప్రవేశ పెట్టిన పలు తీర్మానాలను సభ్యులు మహమ్మద్ ఖాజీ, కె.దుర్గ, ఎస్ యుగంధర్‌ప్రసాద్ తదితర సభ్యులు ఆమోదించారు.

ఆకర్షణీయంగా 'ఐ లవ్ ఏలూరు'



విద్యుత్ కాంతుల్లో వాటర్ పౌంటెయిన్



వాటర్ పౌంటెయిన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే నాని

ఏలూరు టౌన్: 'ఐ లవ్ ఏలూరు' ట్రెండింగ్‌గా మార్చేలా ఏలూరు నగరంలో వాటర్ పౌన్‌టెయిన్‌ను నిర్మించారు. స్థానిక జెడ్పీ కార్యాలయం సమీపంలో జిల్లాలోని కొల్లేరు సరస్సును గుర్తు చేసేలా కొంగలు.. పచ్చని గడ్డి, బోన్సాయ్ మొక్కలు, పూలమొక్కలు నాటి పార్కులా తీర్చిదిద్దారు. లోపల గ్రీనరీకి నష్టం వాటిల్లకుండా చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుచేశారు. రూ.20 లక్షల నిధులతో చూడచక్కగా వాటర్‌ఫాల్‌ను రూపుదిద్దారు. వాయు కాలుష్యాన్ని నివారించేందుకు నగరంలోని మరో మూడు ప్రాంతాల్లోనూ వాటర్ పౌన్‌టెయిన్‌లు రూపొందించనున్నారు. వాటర్ పౌన్‌టెయిన్‌ను ఎమ్మెల్యే ఆళ్ల నాని, జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, నగర మేయర్ నూర్జహాన్ తదితరులు శుక్రవారం ప్రారంభించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నారు.

సీనియర్ సిటిజన్స్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న సీనియర్ సిటిజన్స్ కార్యవర్గ సభ్యులు

ఏలూరు (టూటౌన్): సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 2023–25 సంవత్సరాలకు సంబంధించి ఏలూరు యూనిట్ నూతన కార్యవర్గం శుక్రవారం ప్రమాణ స్వీకారం చేసింది. స్థానిక టీటీడీ కళ్యాణ మండపం సమీపంలోని సంఘం జిల్లా కార్యాలయంలో సభ్యులచే ఎన్నికల అధికారి యం.బి.శంకరరావు అధ్యక్షుడిగా డాక్టర్ ఎన్‌వీవీఎస్ ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా వి.నారాయణరావు, ఎం శివరామకృష్ణారావు, కార్యదర్శిగా డి.భాస్కరరావు, సంయుక్త కార్యదర్శులుగా బాపినీడు చౌదరి, నారాయణ, కోశాధికారిగా శాంతారావు, కార్యనిర్వాహక కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. తొలుత సంఘ అధ్యక్షుడు ప్రసాద్, గౌరవ అధ్యక్షుడు హనుమంతరావు, ఉపాధ్యక్షులు నారాయణరావు, శివరామకృష్ణారావు, సభ్యులు సూర్యనారయణ రెడ్డి, కిషోర్‌లు మాట్లాడారు. కార్యదర్శి డి.భాస్కరరావు వార్షిక కార్యకలాపాలను, కోశాధికారి శాంతారావు వార్షిక జమా ఖర్చులను వివరించారు. సభ్యులు శ్రీహరికోటి, చేగు విజయ కుమార్‌లు తమ గాత్రంతో సభ్యులను అలరించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	34
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	21
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	26

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	21
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	27
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	31
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	26
ఏలూరు బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	29
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	14
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	31
ఏలూరు –తిరుపతి	16.00	4830	33

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర		
టమాటాలు	20	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	40	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	40
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	05–07
బెండకాయలు	24	కంద	48
పచ్చిమిర్చి	40	బీట్‌రూట్	36
కాకర కాయలు	24	కీరా దోస	36
బీరకాయలు	24	ఫ్రెంచ్‌బీన్స్	90
క్యాబేజీ	24	అల్లం	120–240
క్యారెట్	36	కొత్తిమీర (కట్ట)	30
దొండకాయలు	20	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	32	తోటకూర	10
గోరుచిక్కుడు	34	గోంగూర	06
దోసకాయలు	24–32	పుదీనా	05
అనపకాయ (1)	15–20	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	48
		నిమ్మకాయలు (డజను)	--

సీఎం జగనన్న పాలనలో రాష్ట్రం సుభిక్షం


వృద్ధురాలి సమస్య పరిష్కరిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనతో రాష్ట్రం సుభిక్షంగా ఉందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం భోగాపురంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే అబ్బాయ్య చౌదరి అధ్యక్షతన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భోగాపురం పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరికి ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మహిళలు ఎమ్మెల్యేకి బ్రహ్మరథం పట్టి అడుగడుగునా హారతులు పట్టి, తిలకాలు దిద్దారు. ముందుగా గ్రామంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక ఉన్నత పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అక్క చెల్లెమ్మలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. అర్హులందరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు, వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా డాక్టర్ వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాతా రమ్య, మండల పార్టీ అధ్యక్షుడు జానంపేట బాబు, కొప్పాక సొసైటీ చైర్‌పర్సన్ చళ్లగొళ్ళ భూస్వామి, సర్పంచ్ దిమ్మిటి నాగమల్లేశ్వరి, ఉపసర్పంచ్ అబ్బదాసు రూతమ్మ, గ్రామ నాయకులు నాయకులు దిమ్మిటి రమేష్, మరీదు బాలస్వామి, వేగుంట అచ్యుతరావు, నెక్కలపు జగన్‌మోహన్‌రావు, కొమ్మిరపు నారాయణ, అబ్బదాసు సుబ్బారావు, గొళ్ళ సత్యనారాయణ, రాజువరపు వెంకట్రావు, గొల్లపల్లి జోజి, అబ్బదాసు నవీన్, బాడిత శివబాబు, బత్తిన శ్రీనివాసరావు, వీర్ల శరత్, ఇతర ప్రజా ప్రతినిధులు, సొసైటీ అధ్యక్షులు, పార్టీ అధ్యక్షులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.